




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 950 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# శతాబ్దాల తెలుగు పత్రికలు తీరుతెన్నులు

–2–




ఈ భాగంలో , 1900 నుండి 1950 వరకూ వచ్చిన కొన్ని ముఖ్యమైన పత్రికల గురించి తెలుసుకుందాం. ఈ అర్ధ శతాబ్దాన్నీ “అభ్యుదయం – అమూల్యం – అనుభవసారం” అంటున్నాను. పురాణేతిహాసాలూ, ప్రాచీన కావ్యాలూ వాటి తర్వాత వచ్చిన తెలుగు సాహిత్యంలో

మహామహులూ, హేమాహేమీలు తమ రచనలతో విజృంభించింది ఈ అర్ధ శతాబ్దం లోనే. దీనికి ఒక కారణం కూడా వుంది. చిన్న కథా, నవలా, భావకవిత్వం ఇట్లాంటి సాహిత్య ప్రక్రియలన్నీ కూడా ఈ సంవత్సరాల్లోనే మొదలయ్యాయి.


అయితే, గ్రాంథిక భాష నుండి పక్కకు వచ్చి, సరళమైన తెలుగులో, వాడుకలో వున్న తెలుగులో సాహిత్య సృష్టి జరగడంతో పత్రికలు చదివే పాఠకుల సంఖ్య బాగా పెరిగింది. తెలుగు సాహిత్యంలో "హూ ఈజ్ హూ "అనే వర్గానికి చెందిన అనేక మంది 1890– 1910 మధ్య జన్మించారు. ఉదాహరణకు విశ్వనాథ, దేవులపల్లి, చలం, శ్రీశ్రీ, అడవి బాపిరాజు ఇలా అనేక మంది ఆ సంవత్సరాల్లోనే జన్మించిన వాళ్ళు అవడంతో వాళ్ళు ఉధృతంగా రచనలు చేసిన సంవత్సరాలు 1900–1950 మధ్యలోనే వచ్చాయి.

అందుకని ఆ రోజుల్లో వచ్చిన పత్రికలు "అభ్యుదయం– అమూల్యం–అనుభవసారం "అనడానికి అన్ని విధాలా అర్హమైనవే. ఇప్పటికి కూడా తెలుగు సాహిత్యం గురించి మాట్లాడుకునేటప్పుడు ప్రామాణికంగా నిలిచిన అనేక రచనలు ఆ సంవత్సరాల్లోనే ఎక్కువగా వచ్చాయి. ఇన్ని కారణాలవల్ల ఆ సంవత్సరాల్లో వచ్చిన రచనలకు తెలుగు సాహిత్యంలో ఒక ఉత్కృష్టమైన స్థానం వుంది. అప్పట్లో వచ్చిన అనేక పత్రికల్లో నుండి కొన్ని మాత్రమే ఎంచుకోవడానికి ప్రాతిపదిక ఏమిటంటే... ఏదో ఒక ప్రత్యేకత కలిగి ఉండడం. అలాంటి పత్రికల్ని కాలక్రమంలో అవి ప్రారంభం అయినా సంవత్సరం ఆధారంగా వరసగా మీకు పరిచయం చేస్తాను.

వీటిలో చాలా పత్రికలూ 40,50 సంవత్సరాల పాటు కొనసాగాయి కాబట్టి, అలాంటి సందర్భాలలో ఒక పత్రిక గురించి ప్రారంభించాక దాన్ని గురించిన పూర్తి సమాచారంతో ముందుకు వెళ్లి, ఆ విశేషాలు పూర్తి అయ్యాక మళ్ళా వెనక్కి వచ్చి, ఆ తరవాత ప్రారంభం అయిన పత్రికల గురించి తెలుసుకుందాం. ఉదాహరణకు "ఆంధ్ర పత్రిక" 1908 లో ప్రారంభం అయి, 1991 వరకూ నడిచింది. అందువల్ల, ఆ పత్రిక గురించి మాట్లాడుకుంటున్నప్పుడు, ఆ దశాబ్దాలన్నీ చూసుకుంటూ వెళదాం. ఆ పత్రిక గురించి 1991వరకూ జరిగిన విశేషాలన్నీ పూర్తి చేసుకొని, మళ్ళా వెనక్కి అంటే, 1908 కి వచ్చి, తరవాత ప్రారంభం పత్రికల గురించి తెలుసుకుందాం. మీరు అర్ధం చేసుకోవడానికి వీలయినంత స్పష్టంగా, వీలయినంత గందరగోళం లేకుండా తెలియజేయడానికి నా శక్తి వంచన లేకుండా వివరించడానికి ప్రయత్నిస్తాను.

1900 వ సంవత్సరం వరకూ వెలువడిన పత్రికలతో పోలిస్తే.. 1900 తరువాత మొదలైన పత్రికల్లో అనేక మార్పులు సంభవించాయి. దానికి కారణాలు కూడా వున్నాయి. అఖిల భారత కాంగ్రెస్ లాంటి సంస్థల వల్ల, కొత్త ఉత్సాహం , రాజకీయ చైతన్యం పుంజుకున్నాయి. అలాగే జాతీయ ఉద్యమం ప్రభావం కూడా తెలుగు వాళ్ళ మీద ఎక్కువ అయ్యింది.

"మన భాష, మన సాహిత్యం అనే భావాలు పెరిగాయి. వాటితో పాటుగా పాశ్చత్య సాహిత్యంలో ఉన్నవాటిని, మన సాహిత్యంలో తీసుకువస్తే బాగుంటుంది" అనే ఆలోచనలు కూడా వచ్చాయి. 1900 సంవత్సరం తరవాత మొదలైన తెలుగు పత్రికల్లో మనం విశేషాలు తెలుసుకోబోతున్న పత్రిక మొదటి పత్రిక "హిందూ సుందరి".




ఈ పత్రిక ప్రత్యేకతలు చాలా వున్నాయి. " బండారు అచ్చమాంబ" అనే పేరు మీరు వినే వుంటారు. ఆమె, కాకినాడ లో "స్త్రీ విద్యార్థిని సమాజము"అనే ఒక మహిళా సమాజాన్ని స్థాపించి, మహిళల చైతన్యం కోసం కృషి చేస్తుండేవారు. 1900 ప్రాంతాల్లో ఆ "స్త్రీ విద్యార్థిని సమాజము" తరపున "హిందూ సుందరి"అనే పత్రికను 1902 జూన్ లో ప్రారంభించి, దాదాపు 40 సంవత్సరాలు 1940 వరకూ దాన్ని కొనసాగించారు.

మామూలుగా ఎవరో పెట్టుబడిదారుడో, ఎవరో ఒక సంపాదకులు పత్రికను ప్రారంభిస్తే, దాన్ని గురించి పెద్దగా చెప్పుకోవలసిన అవసరం లేదు. కానీ, ఈ "హిందూ సుందరి"ప్రత్యేకత, మహిళల నిర్వహణలో, మహిళల సమస్యల కోసం వెలువడిన తొలి మహిళల మాస పత్రిక ఈ "హిందూ సుందరి". మహిళలు మాత్రమే నిర్వహిస్తూ, మహిళలు మాత్రమే పెట్టుబడి పెడుతూ, మహిళలు మాత్రమే రాస్తూ,ఆ రోజుల్లో దానిని 40 సంవత్సరాల పాటు నడపడం అనేది చాలా ప్రముఖంగా చెప్పుకోవలసిన విషయం. ఆ పత్రికలో టాగ్ లైన్ లో ఇలా రాశారు. "ఇది ప్రత్యేకముగా హిందూ స్త్రీల కోసం ప్రతి మాసమూ ప్రచురించబడును"అని. ఈ పత్రిక 1902 జూన్ లో మొదలైనపుడు దీనికి సంపాదకత్వం వహించినవారు శ్రీమతి మాడభూషి చూడమ్మ, కళ్లేపల్లి వెంకట రమణమ్మ. ఆ తరువాత సంవత్సరాల్లో చాలా మంది మారుతూ వచ్చారు.

ఎంత మంది మారినా గానీ, ఈ పత్రికకు వ్రాసే రచయిత్రులు దాదాపు 100 మంది ఉండేవారు. వారిని 'విలేఖరాండ్రు' అని పరిచయం చేస్తూ ఉండేవారు. ఈ పత్రికలో రాసిన కొంత మంది – కందనపల్లి కనకమ్మ, గూడపాటి లక్ష్మీ నరసమ్మ, బుర్రా బుచ్చి బంగారమ్మ, మామిడన్న కామేశ్వరమ్మ, ఇప్పగుంట వెంగమాంబ, చోడగుడి సీతమ్మ, ఎర్ర గుంట జనార్ధనమ్మ. ఇలాంటి వాళ్ళు ఒక వంద మంది రాస్తూ ఉండేవారు.

ఈ పత్రిక మరో విశేషం ఏమిటంటే, 1902 లో నవంబర్ లో బండారు అచ్చమాంబ గారు రాసిన "ధన త్రయోదశి" అనే కధను ఈ పత్రికలోనే ప్రచురించారు. మనకు తొలి కథ, లేదా కధానిక ఏది?అంటే గురజాడగారి "దిద్దుబాటు" అని చెబుతుంటారు. చాలా వరకు అదే రికార్డులలో కూడా లభిస్తూ ఉంటుంది. అయితే, కొంతమంది 1910 లో గురజాడ రాయడానికి ముందే 1902 లో బండారు అచ్చమాంబ గారు వ్రాసిన "ధన త్రయోదశి"ని మొట్ట మొదట కధగా పరిగణించి తీసుకోవాలి అంటారు.

మరికొంత మంది "కథ నిడివికి పరిమితి ఉండాలి. అచ్చమాంబగారు వ్రాసింది మరీ 20 పేజీలు వుంటుంది కాబట్టి దీన్ని కథగా పరిగణించలేము." అంటారు. ఈ వివాదాలు పక్కన పెడితే, "హిందూ సుందరి" ప్రత్యేకత బండారు అచ్చమాంబ గారి కథ "ధన త్రయోదశి"ని ప్రచురించడం. తెలుగులో తొలి కథ ఏది? అనే వివాదం వచ్చినపుడు కూడా ఈ "హిందూ సుందరి "పత్రిక ప్రస్తావన తప్పక వస్తూ ఉంటుంది. ఇక ఈ పత్రికలో మహిళల పండిత ప్రకర్ష గురించి చెప్పికోవాలంటే.. భజగోవింద శ్లోకాల ప్రవచనమూ, సత్కార్యోత్సాహమూ, సంఘ లాభములూ, బాలికా వివాహములూ... ఎంతో వైవిధ్య భరితమైన అంశాలను గురించి, ఈ హిందూ సుందరి లో వ్రాస్తూవుండేవారు. ఉదారణకు దాని విషయసూచిక లోని అంశాలు..

విక్టోరియా మహారాణి, పర్షియా దేశపు బాలికల స్థితి, స్త్రీలు నేర్చుకోవలసిన ధర్మములు, అగ్ని భయములు వాటి నుండి నివారణములు, గృహ సౌకర్యమునకు మార్గములు, సతీ పతుల సల్లాపము, స్త్రీ విద్య విజయ వార్త, రావణ సంహారము, పంజరంలో రామ చిలక పాట, రైలు బండి పాట, కృతి విమర్శనమూ, వర్తమానము... ఇంత వైవిధ్య భరితమైన అంశాలు వున్నాయి. ముఖ్యంగా మహిళలకూ, వారి మానసిక వికాసానికి దోహదం చేసేవి, వాళ్లలో చైతన్యం కలిగించేవి అయిన అంశాలు క్రోడీకరిస్తూ 40 సంవత్సరాల పాటు నడిపారు.

అలాగే ఆ "హిందూ సుందరి " లోని మరో శీర్షిక "డ్యూటీస్ ఆఫ్ ఫ్యామిలీ గర్ల్ "అని స్త్రీలు నేర్చుకోవలసిన ధర్మములు "అని వ్రాశారు. "మిత భాషితం మంచిది. విశేషముగా మాట్లాడినా, అవివేకము వెల్లడి అవును. ఉతికిన వస్త్రములు ధరింపవలయును. ఇతరుల ధనమును అపహరింప కూడదు. అట్టి దుర్గుణములు

కలిగిన స్త్రీలు, స్త్రీ లోకము చేత దూషింప బడుదురు.పరులను నిందింప కూడదు. పండ్లు కొరుకుట అలవాటు మానుకొనుము. సంధ్య కాలమందు నిదుర కూడదు.“ ఇలా ఒక 40,50 వరకూ రాశారు, ప్రతి సంచికలోనూ.

అప్పట్లో స్త్రీలు బయటకు వచ్చేవారు కాదు. స్త్రీ విద్య అనేది తక్కువగా ఉండేది. బయటకు రావడమే ఒక గొప్ప కార్యము లాగ ఉండేది. అలాంటిది చదువుకోవడం అంటే, గొప్ప ఘన కార్యములాగ భావిస్తుండేవారు. అలాంటి రోజుల్లో ఇంట్లో వున్న స్త్రీలకు చైతన్యం కలగాలి. వాళ్లకు విషయం తెలియాలి. అంటే, ఇట్లాంటివి అన్ని ఉండాలి అని “హిందూ సుందరి”పత్రికలో వ్రాస్తూ వచ్చారు.

విదేశాల్లో జరుగుతున్న విశేషాలు కూడా కాకినాడ లో వున్నా వాళ్లకు గానీ, ఈ పత్రిక చందా దారులకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో వాటిని తెలుగులోకి అనువాదం చేసి ప్రచురిస్తూ ఉండేవారు. 1913 ఆగస్టు సంచికలో వార్తావళి అని ఒక వార్త రాశారు. దాంట్లో వున్నది యధాతధంగా ఇస్తున్నాను. అయితే, అందులో ఏదో స్త్రీలకూ ఉపయోగం వుంటుందని, చైతన్యం పూరితమనీ కాదు. ఆసక్తికరమైన ఆ వార్త ఏమిటంటే...


“ఒక ఫ్రెంచి జమిందారిణిని, ఒకడు పెండ్లియాడెను. వాడు.. ఇంకొక ధవవంతురాలిని పెండ్లి యాడగోరి, భార్యతో అన్యోన్యముగా మెలగుచూ, మంచి మాటలు చెప్పి, ఆమె వలన సంతానము చేయించి, కొన్ని తెల్లకాగితములు పుచ్చుకొని, వాటిమీద తనకు అనుకూలముగా భార్య వ్రాసినట్లు కొన్ని ఉత్తరములు వ్రాసి, భార్య వ్యభిచారిణి అని దావా వేసి, వివాహము రద్దు పరచుటకు ఉత్తర్వులు బడసి, అందుకు భార్య కూడా అంగీకరించి నటులు తానే వ్రాసెను, కానీ, ఆమెకు ఏమియూ తెలియదు.

ఆ కుటుంబమునకు పరిచయం అయిన ఒక వైద్యుడు ఒక నాడు ఆ భార్యకు కనుపించునపుడు ”నీ భర్త నిన్ను పరిత్యజించిన పిమ్మట, నీవు వెచ్చటయున్నావు “ అని అడుగగా, ఆమె “తానేమీ ఎరుగను”అని చెప్పెను. పిమ్మట ఆమె భర్త వలన మోసము నంతయునూ తెలుసుకొని, పోలీసు వారికీ ఎరిగించెనట. ఆమె ప్రవర్తనము ఏమియూ లోటు లేదని, అందరూ ఎరుగుదురు. మోసగాడు ఆమె భర్త, ఆమెను వదలి, తను కోరిన ధనవంతురాలిని పెండ్లి యాడెనట. పోలీసు వారు అరవవలసి యున్నది” ఇది ఒక వార్త. ‘విదేశాల్లో ఇలాంటి విచిత్రమైన సంఘటనలు జరుగుతాయి.’ అని హిందూ సుందరిలో వేశారు.

ఇదే పత్రికలో మరో విశేషము. గూడపాటి లక్ష్మీ నరసమ్మ గారని ఆవిడ ఒక చిన్న నాటిక రాశారు. ఆ నాటికలోని అంశం ఏమిటంటే – అప్పట్లో ఆచంట లక్ష్మీపతిగారని ఒక డాక్టర్ గారు ఉండేవారు. ఆయన అల్లోపతి వైద్యంలో నిపుణులే కానీ, ఎక్కువగా ఆయుర్వేదం నేర్చుకొని ఆయుర్వేద డాక్టర్ గా పేరు

తెచ్చుకున్నారు. అతను, రుక్మిణమ్మ గారు అనే ఆమెను వివాహం చేసుకున్నారు. ఆ రోజుల్లో వారి వివాహం సంచలాత్మకం. ఎందుకు అయిందీ?ఎలా అయిందీ అనేది ఆచంట లక్ష్మీ పతిగారి గురించి మాట్లాడుకున్నప్పుడు తెలుసుకుందాం. వాళ్ళిద్దరి వివాహ సంఘటననూ ఒక నాటిక రూపంలో వ్రాసి "స్వయంవరం" అనే పుస్తకరూపంలో ప్రచురించి, దానిని ఈ "హిందూ సుందరి చందాదారులకు నాలుగు అణాలకు ఇస్తాం" అని ఒక ప్రకటన వేశారు. ఆ ప్రకటన ఇలా వుంది.

" ఇది విద్యావతి అగు శ్రీమతి లక్ష్మీ నరసమ్మ గారిచే రచింపబడినది. హిందూ సుందరి చందాదారులకు నాలుగు అణాలూ, తదితరులకు ఆరు అణాలూ. పోస్టింగూ, పేకింగూ ఖర్చులు కొనువారే భరించవలయును. వలయువారు "హిందూ సుందరి ఆఫీసు, కాకినాడ " అని వ్రాసి, బడయ గలరు. అంత ప్రసిద్ధం అన్నమాట ఆ హిందూ సుందరి పత్రిక. "హిందూ సుందరి, కాకినాడ "అని రాస్తే ఉత్తరాలు వెళ్లిపోయేవి. ఇది ఆ హిందూ సుందరి పత్రిక గురించిన క్లుప్తమైన సమాచారం.


మాసపత్రిక.

| సంపుటము ౧ Vol. 1. | విశాఖపట్టణము:— 1903 సంవత్సరము, నవంబరు. | సంచిక. ౩ No. 3. |
|---|---|---|

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆది | 1 | 8 | 15 | 22 | 29 |
| సోమ | 2 | 9 | 16 | 23 | 30 |
| మంగళ | 3 | 10 | 17 | 24 | ... |
| బుధ | 4 | 11 | 18 | 25 | ... |
| గురు | 5 | 12 | 19 | 26 | ... |
| శుక్ర | 6 | 13 | 20 | 27 | ... |
| శని | 7 | 14 | 21 | 28 | ... |

విషయసూచిక.

1. ఈ నెలలో వచ్చు పర్వములు మొదలగునవి.
2. కల్పలతా పారితోషికములు.
3. కల్పలతా పారితోషిక ప్రశ్నలు.
4. విజ్ఞానవల్లిక.
   1. గాలిపటములు.
   2. కీలుపనులు.
   3. శస్త్రవైద్యము.
5. మాతృప్రేమ.
6. ముగ్ధ.
7. కొప్పముడుచుట.
8. వేశ్యామాతలు.
9. వేసవి.
10. చిత్తరువు.
11. అడిదము సూరకవి చాటుధార.
12. వినోదవల్లిక.
    1. కీరశారికా సంభాషణము.
    2. పద్యపటాలు.
13. లలిత.
14. కందమూలములు.
15. ఆశ్చర్య...ము.
16. కాంగ్రెసుసభ; ఎగ్జిబిషను.
17. అడిదము సూరకవి వేళాకోళపు చాటుధార.
18. భూమితత్వము. (Geology)
19. ఉత్తరరామచరిత్రము.
20. కృతివిమర్శనము.

Printed by A. Venkatareddi, at the S. S. M. Press, and published by A. Kameswara Rao Pantulu, Vizagapatam.

దీని తర్వాత మనం చెప్పుకోబోయే పత్రిక "కల్పలత ". ఇది విశాఖపట్నం నుండి వచ్చేది. దీనికి కూడా కొన్ని ప్రత్యేకతలు వున్నాయి. దీన్ని "ఆచంట సాంఖ్యాయన శర్మ"అనే ఆయన నడుపుతూ ఉండేవాడు. 1903 నుండి రెండున్నర సంవత్సరాల పాటు వచ్చి, మధ్యలో ఆగిపోయి, 1927 లో మళ్ళీ వచ్చింది. ఇందులో ఎక్కువ రచనలు ఆచంట సాంఖ్యాయన శర్మ గారే చేస్తుండేవారు.

ఇందులో ప్రాచీన సాహిత్యం లోని వైజ్ఞ్యానిక విషయాలూ అంటే"సైన్స్ ఇన్ ఓల్డ్ క్లాసిక్స్"అనేవి ఎక్కువగా వ్రాస్తూండేవారు. ఆధునిక కథానికలు కూడా వస్తుండేవి. ఈ "కల్పలత" పత్రిక గురించిన మరొక ప్రత్యేకత ఏమిటంటే, 1903 నవంబర్లో ఆచంట సాంఖ్యాయన శర్మగారే "లలిత"అనే కథానిక రాసారు. కొంత మంది "ఈ "లలిత" కథనే , మొదటి కథగా లెక్కవేయాలి. గురజాడ వరకూ ఆగవలసిన పని లేదు " అంటారు.

అందువల్ల మొదటి కథ ఏది? అనే వాదనల్లో, బండారు అచ్చమాంబ"ధనత్రయోదశి".. ఆచంట సాంఖ్యాయన శర్మ"లలిత.. గురజాడ "దిద్దుబాటు"వీటి గురించి వాదనలు వున్నాయి.

ఆ వాదనల్లో ఒకటైన 'లలిత' కథ 'కల్పలత' లో వచ్చింది. విభిన్నంగా ఇంకొక పని ఏం చేసేవారంటే, "లిటరరీ కాంపిటీషన్స్" అంటే "సాహిత్య ప్రతిభా పాటవాలు" నిర్వహిస్తుండేవారు. ఆరోజుల్లో "వెంకట పార్వతీశ కవులు" అని జంట కవులు ఉండేవారు. వాళ్ళు బెంగాలీ డిటెక్టివ్ నవలలను తెలుగులోకి అనువాదం చేసేవారు. వాళ్ళు కూడా ఈ కల్పలత పత్రిక ద్వారానే పరిచయం అయ్యారు. 1903 నవంబర్ సంచిన విషయం సూచిక చూడండి.

కల్పలతా పారితోషికములూ, కల్పలత పారితోషిక ప్రశ్నలూ, విజ్ఞాన వల్లికా, శస్త్ర వైద్యం ఇలాంటివన్నీ ప్రాచీన సాహిత్యంలో ఎలా ఉండేవి?"అన్నవి ఈ పత్రికలో వ్రాసేరు. మాతృ ప్రేమ, వేకువ, చిత్తరువు... ఇలాంటివి ఒక 20 అంశాలు వున్నాయి. అప్పట్లో పత్రికలకు ముఖ చిత్రాలు ఏమీ ఉండేవి కావు. మొట్ట మొదటి పేజీలోనే విషయం సూచిక రాస్తూండేవారు. పైన మాత్రం 'సంపుటము –సంచిక– ఎక్కడ నుండి వస్తున్నది? విశాఖపట్నము, దాని సంవత్సరము–నెల ఇలాంటివి ఉండేవి. ఇవి కల్పలతకు సంబందించిన వివరములు.

తరువాత విశాఖపట్నం నుండి వస్తుందే మరో పత్రిక గురించి మాట్లాడుకుందాం. 1900 వ సంవత్సరంలో ప్రారంభం అయి, అనేక దశాబ్దాలు కొనసాగి, తెలుగువారు సగర్వంగా ఇవి మా పత్రికలు అని చెప్పుకుంటున్న రెండు పత్రికల విశేషాలు తెలుసుకుందాం. అందులో ఒకటి 1903 లో బందరు ప్రారంభం అయి, 1912 లో హైదరాబాద్ లో ముగిసిన "కృష్ణా పత్రిక". రెండోది 1908 లో బొంబాయి లో ప్రారంభమయి 1991 లో హైదరాబాద్ లో ముగిసిన "ఆంధ్ర పత్రిక" ఈ రెండు పత్రికలూ కూడా మొదలైన దగ్గరనుంచీ తెలుగు జాతి మీద శక్తివంతమైన ప్రభావాన్ని కలిగించాయి.

ఆ రోజుల్లో కృష్ణా పత్రికా, ఆంధ్ర పత్రికా చదవని ఆంధ్రుడు లేడు. ఆ రెండు పత్రికల ప్రసక్తిలేని తెలుగు సాహిత్య చరిత్రను మనం ఊహించలేం. 'కృష్ణా పత్రిక' ఒక సంస్థాగత పత్రికలాగా ప్రారంభమయి, అతి కొద్ది సంవత్సరాలలోనే, వ్యక్తిగత నిర్వహణలోకి వెళ్లి, రికార్డుల పరంగా 110 సంవత్సరాలపాటు కొనసాగింది. అయితే, మధ్యలో అనేక చేతులు మారింది. అనేక సార్లు ఆగిపోయింది. మళ్ళీ మొదలయింది. పక్ష పత్రిక, వార పత్రిక, దినపత్రిక ఇలా రూపాలు మార్చుకొంది. ఈ కృష్ణా పత్రిక అత్యంత వైభవంగా వెలుగొందిన సంవత్సరాలు 1902 నుండి 1960, 70 వరకు అని చెప్పుకోవచ్చు. ఆ తర్వాత నామ మాత్రం గానే ఉందిగాని దాని ప్రభావం అంత ఎక్కువగా లేదు.

అదే ఆంధ్ర పత్రిక విషయానికి వస్తే, ఒక వ్యక్తి నిర్వహణలో, తెలుగు నేలకు కొన్ని వందల మైళ్ల దూరంలో బొంబాయి లో మొదలైనప్పటికీ, తరువాత, తరువాత పటిష్టమైన వ్యవస్థగా రూపొందింది. మధ్యలో ఆటంకాలు లేకుండా, ఒక్క నెలగానీ, ఒక్క వారం గానీ, కనీసం ఒక్క రోజైనా ఆగకుండా 1991 వరకూ కొనసాగింది. ఆంధ్ర పత్రిక, దాని అనుబంధ పత్రిక. ఆంధ్ర పత్రిక బ్రాండ్ అనేది 1991 వరకూ కొనసాగింది.

ఆ సంస్థ తరపున వార పత్రిక 83 సంవత్సరాలూ, దిన పత్రిక 77సంవత్సరాలూ , మాస పత్రిక 67 సంవత్సరాల పాటు నిరాటంకంగా వెలువడడం అనేది ఆంధ్ర పత్రిక ప్రత్యేకత. ఆ తొలి దశాబ్దాలలో అంటే, 1900 సంవత్సరాలలో ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక రెండూ కలిపి ఆంధ్ర దేశం మీద అత్యంత శక్తివంతమైన ప్రభావాన్ని చూపించాయి. ఈ విషయాన్నీ అందరూ గ్రహించి, 1929 లో బెజవాడలోని పుర ప్రముఖులు ఆ రెండు పత్రికలకూ సన్మానం చేశారు. ఇంత విశిష్టమైన చరిత్ర సృష్టించుకున్న ఆ రెండు పత్రికలలో మొదట కృష్ణా పత్రిక గురించి తెలుసుకుందాం.




"కృష్ణా పత్రిక" ఆ పేరు వింటేనే తెలుస్తుంది అది కృష్ణా జిల్లా నుండి వచ్చింది అని. 1890 ప్రాంతాల్లో కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా ఈ మూడు జిల్లాలో ఒకే జిల్లాగా కలసి ఉండేవి. 1892 లో కృష్ణా జిల్లాకు సంబందించిన కొంత మంది యువకులు "మన యువకుల్లో చైతన్యం తీసుకురావడానికి, మనం ఒక సంఘంలాగా ఏర్పడదాము. భారత జాతీయ భావాలు ప్రచారం చేయడానికీ, జాతీయోద్యమంలో వాళ్ళను భాగస్వామ్యం చెయ్యడానికీ స్వాతంత్రోద్యమం వైపు వాళ్ళను మరల్చడానికీ" అనే లక్ష్యాలతో ఒక సంఘాన్ని ఏర్పరుచుకున్నారు.

దానిపేరు "కృష్ణా జిల్లా సంఘం"అందులో కొంత మంది సభ్యులు పురాణం వెంకట అప్పయ్య, వేమూరు సుబ్బారావు, సెడిబి హనుమంతరావు, జంధ్యాల గౌరీనాధ శాస్త్రి, కొండా వెంకటప్పయ్య,

అయ్యంకి వెంకటరావు ఇలాంటి వాళ్ళు. వాళ్లంతా ఆ సంఘం తరుపున తరచూ కలుసుకుంటూ ఉండేవారు. కార్యక్రమాలు చేపట్టి, యువకుల్ని చైతన్య వంతుల్ని చేస్తుండేవారు. 1900 లో ఈ కృష్ణా జిల్లా సంఘం లేదా కృష్ణా మండలి సంఘం లోని రెంటాల వెంకట సుబ్బయ్య అనే ఆయన "ఒక పత్రిక ప్రారంభిద్దాము" అనే ప్రతిపాదన తీసుకువచ్చాడు.

"ఇంత వరకు మనం అనేక కార్యక్రమాలు చేస్తూవున్నాము. కుర్రవాళ్ళకు కూడా చెబుతున్నాము. అయితే మన భావాలు అందరికీ చేరడానికి మనకి ఒక పత్రిక ఉంటే బాగుంటుంది. అందుకని మనం ఒక పత్రిక పెడదాము. నేను ఒక వంద రూపాయలు చందా ఇస్తాను. "అన్నాడు. అలా అందరు సభ్యులూ చందాలు వేసకొని ప్రారంభించిన పత్రికే "కృష్ణా పత్రిక". అది కృష్ణా జిల్లానుండి వస్తోంది కాబట్టి, దానికి "కృష్ణా పత్రిక"అని పేరు పెట్టారు. కృష్ణా జిలాల్లోని యువకుల కోసం, కృష్ణా జిలాల్లోని ఆంధ్రుల కోసం అది ప్రారంభమయింది. ఆ పత్రిక 1902 ఫిబ్రవరి 1 వ తేదీన విడుదల అయింది. దాని సంపాదకులు "కొండా వెంకటప్పయ్య గారూ, దాసు నారాయణరావు గారు. ఆ పత్రికలో ఏమున్నదో చూద్దాం.

"క్రిష్ణా పత్రిక"అని రాశారు. (THE KISTNA PATRIKA ) ఆ స్పెలింగు అలా ఎందుకు అలా ఉండేదో తెలియదు. కృష్ణా జిల్లా సంఘము తరపున ప్రచురింపబడు పక్ష పత్రిక "ఎ ఫార్చునేట్లీ తెలుగు పిరియాడికల్, పబ్లిష్డ్ ఎట్ మచిలీ పట్నం, కృష్ణా డిస్ట్రిట్, ఎడిటర్:కె. వెంకటప్పయ్య ,B A B L, డి. నారాయణరావు BABL , పత్రికాధిపతులు అని మీదన ఉండి, కింద వార్త మొదలవుతుంది. మూడు కాలమ్స్ లో వచ్చింది.

దీనికి కూడా అప్పట్లో ముఖ చిత్రం లాంటిది ఏమీ లేదు. మొట్ట మొదట పక్ష పత్రికగా ఉండి, 3,4 సంవత్సరాలు గడచిన తరువాత 1906 వచ్చేసరికి వార పత్రికగా మారింది. ఈ పత్రిక ప్రారంభం అయిన ఒక సంవత్సరం లోనే ఒకాయన సహాయ సంపాదకుడిగా చేరాడు. ఆయన పేరు ముట్నూరు కృష్ణారావు. పంతులు గారని తరవాత అనేవారు. మద్రాస్ లో B. A. చదువుకుంటూ ఎన్నిసార్లు రాసిన పాస్ అవ్వక పోయేసరికి, వెనక్కి వచ్చి, బందరులో కృష్ణా క్లబ్ లో సభ్యుడిగా చేరి, తరవాత కృష్ణాపత్రికలో ఉప సంపాదకుడిగా 1903 లో చేరారు.

1905లో కృష్ణా జిల్లాని గుంటూరు జిల్లా నుండి విడగొట్టారు. అప్పుడు కొండా వెంకటప్పయ్య గారు తన స్వస్థలం అయిన గుంటూరు వెళ్లిపోయారు. రెండవ సంపాదకుడు అయిన దాసు నారాయణరావు గారు 1905 సెప్టెంబర్ లో చనిపోయారు.అప్పుడు కృష్ణా పత్రిక నిర్వహణ అంతా దానికి ఉప సంపాదకుడిగా వున్న ముట్నూరు కృష్ణారావు గారి మీద పడింది. ఆయన "కృష్ణా స్వదేశీ ముద్రణ శాల" అనే ఒక ప్రెస్ ని కొనేసి, ఈ

పత్రిక హక్కులు కూడా తీసేసుకొని, ఇక దాని మీద పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుండి ఆయన పేరు మీదుగానే, ఆయన అధిపతిగానే, ఆయన సంపాదకుడి గానే కృష్ణా పత్రిక చాలా సంవత్సరాల పాటు కొనసాగింది.

అయితే ఈ ముట్నూరు కృష్ణారావు గారు కృష్ణా పత్రిక తీసుకున్న రెండు సంవత్సరాలకి బెంగాల్ విభజన ప్రారంభం అయింది. "బిపిన్ చంద్ర పాల్ "అనే ఆయన భారతదేశం అంతా పర్యటిస్తూ ఉండేవాడు. ఆయనతో పాటుగా ముట్నూరు కృష్ణారావు గారు కూడా 1906 లో బెంగాల్ వెళ్లారు. ఆయన అలా వెళ్ళినపుడు ఆయన స్థానంలో మరొకాయన సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారు. ఆయన పేరు "ఔటుపల్లి నారాయణరావు గారు ". కృష్ణారావు గారు బెంగాల్ లో ఒక ఏడాది పాటు పర్యటించి, వెనక్కి వచ్చారు. వచ్చేసరికి ఆయనలో తీవ్రవాద భావాలు,అంటే బ్రిటీష్ వారిని ఎలాగైనా వెళ్ళగొట్టాలి అనే భావాలు ఎక్కువయ్యాయి.

1908 కృష్ణా పత్రికలో ఒక సంపాదకీయం రాశారు. "తెల్లవారిని తుపాకులతో కాల్చుట" అని. పత్రిక కూడా ప్రింట్ అయిపోయింది. పత్రిక బయటకు వెళ్లక ముందు చదివిన వాళ్ళు చెప్పారు " కృష్ణారావు గారూ ఇది బయటకు వెళితే కష్టం అండీ! పైగా 'తెల్లవారిని తుపాకులతో కాల్చుట' అన్నారు. ఇది వాళ్ళు చదివితే మీ పత్రికను మూసేస్తారు. మిమ్మల్ని జైల్లో పెడతారు. పత్రికను బయటకు పంపించవద్దు "అని ప్రింట్ చేసిన కాపీలన్నీ తగలబెట్టేశారు.

కానీ, ఎలాగోలా 1,2 కాపీలు మాత్రం కలకత్తాలోని "స్కాట్"అనే ఆయన దగ్గరకు వెళ్లాయి. అది ఆయన చదివించుకుని అగ్గి మీద గుగ్గిలం అయ్యాడు. "మమ్మల్ని తుపాకులతో కాలుస్తారా మీరు?ఈ పత్రికాధిపతులు ఎవరో తెలుసుకోండి"అని అధికారులను పంపించాడు. అప్పుడు "కృష్ణా జిల్లా సంఘం" సభ్యుడు "సురభి హనుమంత రావు" గారని ఉండేవారు. ఆయన కలెక్టరు గారికి మిత్రుడు. ఆయన కలెక్టర్ గారితో చెప్పాడు

" సంపాదకీయం రాసినందుకు సంపాదకుడ్ని శిక్షిద్దాము. అంతే గానీ పత్రికను మూసేస్తే, ప్రజలకు దూరం అవుతాము"అని. ఆయన నచ్చజెప్పిన మీదట, కృష్ణారావు గారిని, కృష్ణా పత్రిక సంపాదకత్వం నుండి తప్పించారు. అలా మొదలు పెట్టిన మూడు సంవత్సరాలకే ముట్నూరు కృష్ణారావు గారు పత్రిక నుండి బయటకు రావాల్సి వచ్చింది. దాదాపుగా ఆగిపోవాల్సిన పరిస్థితి. "కృష్ణా పత్రిక" అంటే, ఎంత అంకిత భావంతో ఉండేవారు ఆనాటి చురుకైన యువకులు అనడానికి ఒక ఉదాహరణ, ఎన్ని సార్లు ఆగిపోవాల్సిన సందర్భాలు వచ్చినప్పటికీ ఎవరో ఒకరు ముందుకు వచ్చి, దాన్ని భుజాల మీద వేసుకొని, బాధ్యతలు స్వీకరించి, పత్రికను ఆగకుండా నడుపుకుంటూ వచ్చారు.

"ఏటూరు సీతారామయ్య గార"ని ఆయన ముట్నూరు కృష్ణారావు గారి సహాధ్యాయి. ఆయనతో పాటుగా కాలేజీలో చదువుకున్నారు. ఆయన ఏం చేసేరంటే, C. V. రామాచారి అని ఇంకో ఆయన్ని పెట్టుకొని, వాళ్లిద్దరూ కలసి దాదాపు 4 ఏళ్ల పాటు కృష్ణా పత్రికను ఆపకుండా నడిపారు. మళ్ళీ కలెక్టర్ గారు మారిపోయాక, ముట్నూరు కృష్ణారావుగారిని పిలిపించి, రెండువేల రూపాయలు లాభం తీసుకొని, ఆయనకే పత్రికను ఇచ్చేశారు. అప్పటి నుండి అంటే, 1912 నుండి 1945 లో ఆయన చనిపోయేవరకూ కూడా ఆయనే నిర్వహించారు. మధ్యలో ఆయన జైలుకి వెళ్ళినపుడు మాత్రం వేరే వాళ్ళు తీసుకున్నారు.

అప్పట్లో కృష్ణా పత్రిక సంపాదకీయాలు తెలుగులో వాడవాడలా ఎంతో ఆసక్తితో చదువు తుండేవారు. ఆంగ్ల భాష తెలియని చాలా మందికి రాజకీయ పరిజ్ఞానం కలిగించడానికి ఈ సంపాదకీయాలు చాలా ఉపయోగపడ్డాయి. ఈ సంపాదకీయాలవల్లే, అక్షరాస్యులలోనే కాకుండా నిరక్షరాస్యులలో కూడా స్వాతంత్ర్య భావాలు ఎక్కువగా పెంపొందాయి.

మహాత్మా గాంధీగారు కూడా ఈ కృష్ణా పత్రికను తెప్పించుకొని, ఆ సంపాదకీయాన్ని హిందీ లోకి అనువాదం చేయించుకొని, చదివిచుకునే వారట. ఇంకొక చిన్న సంఘటన చెబుతాను. 1929 లో మహాత్మాగాంధీ గారు దివి తాలుకాని సందర్శించినపుడు, కృష్ణా జిల్లానుండి గుంటూరు జిల్లా దాటడానికి, ఆయన కృష్ణా నదిని దాటారు. ఆ సందర్భముగా ఆయనతో పాటుగా ముట్నూరు కృష్ణా రావు గారు కూడా వెళ్లారు. ఆ సన్నివేశాన్ని వర్ణిస్తూ తరువాత సంపాదకీయం రాశారు.

ఎంత చక్కగా రాసారంటే, ఆ సంపాదకీయాన్ని మనం చదువుతుంటే, మనం కూడా ఆ క్షణంలో అప్పుడు మహాత్మా గాంధీతో కలసి, కృష్ణా నదిని దాటుతున్నంత అనుభూతి కలిగేటంత సహజంగా రాశారు. ఆ సంపాదకీయంలోకి కొన్ని వాక్యాలను తీసుకొని శిలా శాసనం లాగ చేసి, ఇటీవల జరిగిన కృష్ణా పుష్కరాలలో దాన్ని ప్రతిష్టించారు. ఈ విషయాన్ని మిత్రులు మండలి బుద్ధ ప్రసాద్ గారు "నేనే అక్కడ శిలాశాసనం లాగ కట్టించానండి." అని చెప్పారు. అంత ప్రభావం ఉండేది ఆ కృష్ణా పత్రిక సంపాదకీయాలకు.

1930 లో మరొక సంఘటన. బందరులో 144 సెక్షన్ పెట్టారు. ముట్నూరు కృషారావు గారు దాన్ని వ్యతిరేకించారు. దాంతో ఆయన్ని 5 సంవత్సరాల పాటు జైల్లో పెట్టారు. అయితే, ఈ 5 సంవత్సరాలు కృష్ణా పత్రిక ఆగిపోవాల్సిన పరిస్థితి ఎదురయ్యింది. ఆ సందర్భంలో కమలాకర వెంకటరావు గారూ, రావూరి వెంకట సత్యన్నారాయణ గారూ లాంటి కొంత మంది మిత్రులు తీసుకొని,1935 లో మళ్ళీ ముట్నూరు కృష్ణా రావుగారు వచ్చినంత వరకూ వాళ్ళు పత్రికను తమ భుజ స్కంధాలపై వేసుకొని నడిపించారు.

ఇన్ని తేదీలూ, ఇంత వివరంగా ఎందుకు చెబుతున్నానంటే, ఈ పత్రిక నడవడం అనేది, ఇది ఒక వ్యాపార సంస్థగా కాకుండా, వ్యక్తిగతంగా నడుస్తున్నప్పుడు, ఆ పత్రిక పట్ల అందరికీ ఎంత నిబద్ధతా, ఎంత కార్య దీక్షా ఉంటేనే... ఎన్ని ఆటంకాలు వచ్చినప్పటికీ నడిచింది అని చెప్పడానికి. ఆ తరువాత కూడా చాలా జరిగాయి. 2010 వరకూ నడిచింది కృష్ణా పత్రిక. బందరులో ఈ పత్రిక నడుస్తున్న రోజుల్లో కృష్ణా పత్రిక ఆవరణ ఒక చిన్న దర్బారు లాగా ఉండేది. దాన్ని "కృష్ణా దర్బార్"అనే వాళ్ళట.

ఆ ఆఫీసు ప్రాంగణం లో ఒక చిన్నతోట. చిత్రశాల అనీ, పాఠశాల అనీ, రాజకీయ రహస్య ఆలోచనా మందిరం అనీ, మునిమాపు వేళల్లో 'ముని పల్లె' అనీ రకరకాల పేర్లతో పిలుస్తుండేవారు. అక్కడ జమ్ము గడ్డితో కూడిన ఒక పర్ణశాల ఉండేది. దాన్ని "జమ్ము మసీదు"అనే వాళ్ళట. ఆ పాకలో ముట్నూరు కృష్ణారావు గారు కూర్చుంటే, ఆయనకు ఎదురుగా అప్పుడప్పుడే రచయితలుగా పేరుతెచ్చుకుంటున్న వాళ్ళు కూడా కూర్చుండేవారు. అక్కడ వుండేవారిలో... పింగళి నాగేంద్ర రావు గారు, అడవి బాపిరాజుగారు, మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు, జలసూత్రం రుక్మిణీ నాథ శాస్త్రి గారు, అద్దేపల్లి మల్లికార్జునరావు గారు ,మునిమాణిక్యం నరసింహారావు గారు, భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు, ఇలా దాదాపుగా 15,20 మంది ఆయన చుట్టూరా కూర్చొని రకరకాల విషయాలు మాట్లాడేవారు. రాజకీయాల గురించి, విలేఖరులు తీసుకువచ్చిన వార్తల గురించి, సాహిత్య విశేషాలు మాట్లాడడం ఇలాంటివన్నీ కూడా ఒక సాహిత్య దర్బారు లాగ ఉండేది.

ఆ దర్బారులో నానా శాస్త్ర సకల కళా విద్యలూ, నవరస భావ సంహితులైన కవి, గాయక, పండిత, నట వదంతులు ఇంత మంది ఉండేవారు. ఆ రోజుల్లోనే కృష్ణా పత్రిక దర్బారుకు ఒక కుర్రవాడు వస్తుండేవాడు. B. A . వరకూ చదువుకొని, వుద్యోగం ఏమీ చెయ్యకుండా, బెజవాడ వెళ్లి, అక్కడ ఇంగ్లీష్ సినిమాలు చూసి, కృష్ణా పత్రికలో"సినీ ఫ్యాన్"అనే పేరుతో రివ్యూలు రాస్తూ ఉండేవాడు. ఆ కుర్రవాడు రాసిన రివ్యూలు కూడా నచ్చి ముట్నూరు కృష్ణారావు గారే ఆ కుర్రవాడికి " సినీ ఫ్యాన్ "అనే పేరు పెట్టారు. కేవలం ఇంగ్లీష్ సినిమాలూ, విదేశీ సినిమాలే కాకుండా తెలుగు సినిమాలకు కూడా ఆ కుర్రవాడు రివ్యూలు రాస్తూండేవాడు. అలా 1930 ప్రాంతాల్లో వచ్చిన ద్రౌపదీ మాన సంరక్షణ, ద్రౌపదీ వస్త్రాపహరణం అనే రెండు సినిమాల గురించి కృష్ణా పత్రికలో సమీక్ష రాస్తూ విజయవంతమైన ద్రౌపదీ వస్త్రాపహరణం "బాగాలేదు " అపజయం పాలైన ద్రౌపదీ మాన సంరక్షణమే బాగుంది. అని చాలా వివరంగా వ్రాశారు. అది చదివిన ఆ సినిమా సారథి H. M. రెడ్డిగారు ఆ కుర్రవాడిని మద్రాస్ పిలిపించి "సినిమా గురించి చాలా చక్కగా రాశావు. సినిమా నిర్మాణం గురించి తెలుసుకోవాలంటే, నువ్వు సినిమాలోకి వచ్చి పని చెయ్యి. కావాలంటే నేను అవకాశం ఇస్తాను "అన్నారు. అప్పుడు ఆ కుర్రవాడు మద్రాస్ వెళ్లి, H.M.రెడ్డి గారి దగ్గర చేరి, ఆ తరవాత కాలంలో "పౌరాణిక

బ్రహ్మ"అయ్యారు. ఆయనే కమలాకర కామేశ్వరావు గారు. అలా కమలాకర కామేశ్వరావు గారు సినిమాల్లో చేరడానికి కృష్ణా పత్రికే కారణం అని చెప్పాలి. మరొక్క విషయం చెప్పి, ఈ పత్రిక గురించి ముగిద్దాం.

ఇంత ఎక్కువగా చెప్పడానికి కారణం వున్నది. ముట్నూరు కృష్ణారావు గారూ, , కృష్ణా పత్రిక లేకుండా తెలుగు సాహిత్యం గురించి, ఆంధ్రుల చరిత్ర గురించి మాట్లాడుకోలేము. క్లుప్తంగా చెబుతాను. మహాత్మా గాంధీ 1940 ప్రాంతాలలో భారత జాతీయ కాంగ్రెస్ కు అధ్యక్షుడిగా ఎన్నికలు నిర్వహించినపుడు ఇటు భోగరాజు పట్టాభి సీతారామయ్య గారూ, అటు సుభాష్ చంద్ర బోస్ గారూ ఇద్దరూ పోటీ చేశారు. సుభాష్ చంద్ర బోస్ గారు ఎక్కువ ఓట్లుతో గెలిచారు.

మహాత్మా గాంధీ గారికి అది ఇష్టం లేదు. " పఠాభి సీతారామయ్య ఓడిపోతే, నేను ఓడిపోయినట్లే" అని ఆ తరువాత మౌన దీక్ష చేశారు. ఇలాంటి పరిస్థితిలో సుభాష్ చంద్ర బోస్ రాజీనామా చేశారు. అది వేరే విషయం. అయితే, ఆ సంఘటన మీద ముట్నూరు కృష్ణారావుగారు, భోగరాజు పట్టాభి సీతారామయ్యను విమర్శిస్తూ రాసారు. ఆయన "ఇదేమిటి?ఈయన నా క్లాస్ మేట్ కదా! ఇలా విమర్శిస్తూ రాసాడేమిటి?" అని చాలా బాధపడి, గొట్టిపాటి బ్రహ్మయ్య గారికి చెప్పారు. ఆయన ముట్నూరు కృష్ణా రావుగారిని అడిగారు.

"ఏమండీ! మీకు మిత్రుడే కదా! ఏవో ఎలక్షన్లు జరిగాయి. వాళ్ళూ, వాళ్ళూ ఓట్లు వేసుకున్నారు. ఒకరు గెలిచారు. ఒకరు ఓడిపోయారు. దానికే మీరంతలా వ్రాయాలా? "అన్నారు. అప్పుడు ముట్నూరు కృష్ణారావు గారు తన తలమీద ఉన్న తలపాగా తీసి టేబులు మీద పెట్టి,

"ఇప్పుడు నేను ముట్నూరు కృష్ణారావుని. ఇప్పుడు భోగరాజు పట్టాభి సీతారామయ్యను ఎవరైనా ఏమైనా అంటే, ఊరుకోను. చీరేస్తాను" అని తలపాగా నెత్తిమీద పెట్టుకొని"ఇప్పుడు నేను కృష్ణా పత్రిక సంపాదకుడ్ని. నాకు రాగద్వేషం వుండకూడదు. నేను ఒక వైపు తీసుకోకూడదు. సంపాదకుడిగా ఏది సబబు అనుకుంటే,అదే రాశాను. అదే రాస్తాను. "అన్నారు.

ఆ రోజుల్లో పత్రికా సంపాదకులకు అంత నీతీ, నిజాయతీ, నిబద్ధతా, రాగద్వేషాలకు అతీతంగా పత్రికను నడపడం ఉండేవి. ఇలాంటి సంఘటనలు గొప్ప ఉదాహరరణలుగా నిలుస్తాయి. ఆయన 1945 లో మరణించారు. మరణించినపుడు మనవరాలి పేర ఒక ట్రస్ట్ పెట్టి, కొంత మందిని ఆ ట్రస్ట్ మెంబర్లుగా పెట్టి, కృష్ణా పత్రిక బాధ్యతను వాళ్లకు అప్పగించారు.

ఆయన చనిపోయాక, పోలవరపు కోటేశ్వరావు, కాటూరి వెంకటేశ్వరావు గారూ ఆ పత్రికను నడిపారు. అలా కొనసాగుతూ 1960లో ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మగారు కృష్ణా పత్రిక బాధ్యత తీసుకున్నారు. ఎవరు నడిపినా గానీ, వాళ్ళ వ్యక్తిగత పేర్ల మీదే పత్రిక నడిచేది. ఆయన కొంత కాలం హైదరాబాద్ లోనూ, కొంత

కాలం విజయవాడ లోనూ మళ్ళీ కొంత కాలం హైదరాబాద్ లోనూ అలా  దాదాపు 20 ఏళ్ళు నడిపారు. చిట్ట చివరికి 1984 లో కృష్ణా పత్రికను హైదరాబాద్ లో “పిరాట్ల వెంకటేశ్వర్లు”అని ఆయన తీసుకున్నారు.

దాన్ని ఆయన 1985 ప్రాంతాల్లో దిన పత్రికగా మార్చారు. 1988 లో నేను పిరాట్ల వెంకటేశ్వర్లు గారిని కలుసుకున్నాను. కృష్ణా పత్రిక ఆఫీసు నల్ల కుంటలో ఒక చిన్న ఇంట్లో ఉండేది. నేను కలిసినప్పుడు ఆయన చెప్పారు ఏదో అవాంతరం వచ్చిందని. “ కొండనాలిక్కి మందేస్తే, వున్న నాలిక ఊడినట్లయింది మా పరిస్థితి”అని. ఆ తరువాత దాన్ని వార పత్రికగా మారుద్దామని ఒకే ఒక్క వారం తీసుకువచ్చారు. అదీ కొనసాగలేదు. మళ్ళీ దినపత్రికగా కొంత కాలం కొనసాగించారు.

ఈ కృష్ణా పత్రిక ‘వంద సంవత్సరాల పండగని’ అప్పటి ప్రధాన మంత్రి వాజ్ పాయ్ గారి నివాసంలో చేశారు. దానికి P. V . నరసింహ రావు, అప్పట్లో కేంద్ర మంత్రిగా వున్న వెంకయ్య నాయుడుగారు, బండారు దత్తాత్రేయ గారు, మండలి బుద్ధప్రసాద్ గారు వీళ్ళందరూ కూడా హాజరు అయ్యారు. 100 సంవత్సరాలు అయిన సందర్భంగా కృష్ణా పత్రిక జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఆ తరువాత 2012 వరకూ వచ్చింది పత్రిక.  ఆ సమయానికి కృష్ణాపత్రిక తన ప్రాభవాన్ని కోల్పోయింది.పేరుకి మాత్రం 2012 వరకూ దిన పత్రికగా వస్తూవుండేది.

2013 లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారి తమ్ముడు ఆ పత్రికను తీసుకుంటారని కొన్ని వార్తలు వచ్చాయి. అదీ జరగలేదు. 2014 లో పిరాట్ల వెంకటేశ్వర్లు గారు చనిపోయారు. కృష్ణా పత్రిక పూర్తిగా ఆగిపోయింది.

అదండీ కృష్ణాపత్రిక యొక్క 110 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం. మధ్య, మధ్యలో ఆగుతూ వచ్చినా, రూపం మార్చుకుంటూ వచ్చినా ఆ బ్రాండ్ అనేది మాత్రం 110 సంవత్సరాల పాటు కొనసాగింది.

ఇప్పుడు మనం తెలుసుకోబోయే పత్రిక “ఆంధ్ర పత్రిక “ఈ పత్రిక విశేషాలు తెలుసుకోబోయే ముందు, దీని వ్యవస్థాపకులు కాశీనాథుని నాగేశ్వరావు పంతులు గారి గురించి తప్పక మాట్లాడుకోవాలి. దేశోద్ధారక, విశ్వదాత అన్న పదాలకు నిలువెత్తు నిదర్శనం కాశీనాథుని నాగేశ్వరావు పంతులు గారు. అతి సాధారణ కుటుంబంలో పుట్టి, అసాధారణ ధనవంతుడై, మళ్ళీ సంపాదనంతటిని దాన ధర్మాలకై ఖర్చు చేసిన వ్యక్తి ఈ కాశీనాథుని నాగేశ్వరావు పంతులు గారు.

“అమృతాంజనం”  తలనొప్పి మందు తెలియని వారు ఎవరూ వుండరు. ఆ అమృతాంజనం సృష్టి కర్తా, ఆంధ్ర పత్రిక వ్యవస్థాపకుడు ఆయనే. అత్యంత స్ఫూర్తి దాయకమైన జీవితం వారిది.  ఆయన బాల్యం నుంచి ఆంధ్ర పత్రిక ప్రారంభం వరకూ జరిగిన కొన్ని సంఘటనలు గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

కాశీనాథుని నాగేశ్వరావు పంతులు గారు 1867 మే 1 వ తేదీన కృష్ణా జిల్లా బందరుకు దగ్గర్లో నిడుమోలు పక్కనే వున్న “ఎలకుర్రు”అనే కుగ్రామం లో జన్మించారు. వాళ్ళ నాన్నగారి పేరు బుచ్చయ్య గారు. వారి అమ్మగారి పేరు శ్యామలాంబ గారు. చిన్నతనం అంతా ఎలకుర్రు లోనే గడచింది. చాలా అల్లరి చేసేవారు. వాళ్ళ నాన్నగారు “ఎలా కట్టడి చెయ్యాలా?” అని బాధ పడుతూ ఉండేవారు.

ఎలకుర్రు లో చదువు అయిపోయాక, కొడుకుని సంస్కృత ఆంధ్ర భాషల్లో పండితుడ్ని చేయాలని వాళ్ళ నాన్న గారు అనుకుంటుండేవారు. నాగేశ్వరావు గారికేమో ఇంగ్లీష్ చదవాలని ఉండేది. చివరికి ఎలాగో వాళ్ళ అమ్మగారిని బ్రతిమిలాడి, వాళ్ళ నాన్నగారిని ఒప్పించారు. బందరు హిందూ హైస్కూల్ లో చేరారు. అక్కడ ఆయనకు నాటకాలతో పరిచయం అయింది. “ధార్వాడ”కంపెనీ వాళ్ళు ఊరూరా తిరిగి నాటకాలు వేస్తుండేవారు. వాళ్ళు బందరులో నాటకాలు వేస్తున్నప్పుడు, వాళ్లతో నాగేశ్వరావు గారు పరిచయం చేసుకొని, వాళ్ళ నాటకాల్లో వేషాలు వెయ్యడం ప్రారంభించారు. ఆయన ఎక్కువగా హరిశ్చంద్రలో చంద్రమతి లాంటి స్త్రీ పాత్రలు వేస్తుండేవారు. .

1885 లో ఆయనకు 18 సంవత్సరాల వయసు వున్నప్పుడు, జగ్గయ్య పేటలో ఏదో నాటకం వెయ్యడానికి వెళ్లారు. అక్కడకు వెళ్ళగానే ఆయనకు కబురు వచ్చింది. “మీ నాన్నగారికి సీరియస్ గా వున్నది. వెంటనే వెనక్కి రా! ” అని. అయితే, నాటక కంపెనీ వాళ్ళు ”నువ్వువెళ్లడానికి వీల్లేదు. నువ్వు వెళ్ళిపోతే, మొత్తం నాటకం ఆగిపోతుంది. మాకు చాలా నష్టం వస్తుంది. “అని నాగేశ్వరావు గారిని వెళ్లనివ్వలేదు. దాంతో ఆయన నాటకం పూర్తి అయ్యేవరకూ ఉండి, నాటకంలో తన పాత్ర వేసేసి, అప్పుడు ఎలకుర్రు వచ్చారు. ఆయన వచ్చిన కొద్దిసేపటికే వాళ్ళ నాన్నగారు చనిపోయారు.

ఆ సంఘటన ఆయనలో తీవ్రమైన మార్పును కలిగించింది. అక్కడితో ఆయన నాటకాలకు స్వస్తి చెప్పారు. అయితే, కాస్త మనం కాలాన్ని ముందుకు తీసుకువెళ్లి చూస్తే నాటక రంగానికి ఆయన విపరీతంగా సహాయం చేశారు. మద్రాస్ లో”కన్నయ్య కంపెనీ”అని వాళ్ళ దగ్గర నాటకాలకు అవసరమయ్యే వస్తువులన్నీ కొని, బెజవాడలో చల్లపల్లి రాజా గారి స్థలాన్ని 12 వేల రూపాయలకు కొని, ఒక లక్షా ఇరవై అయిదు రూపాయలు పెట్టి “దుర్గా కళా మందిర్”అనే నాటకశాలను నిర్మించారు. ఆ తరువాత “ఆంధ్ర నాటక సభ”అనే సంస్థను కొని పోషిస్తూ ఉండేవారు. ఇవన్నీ కూడా ఆయన ధనవంతుడు అయిన తరువాత చేసిన కార్యక్రమాలు. వీటికి కారణం.. చిన్నతనంలో ఆయన వేసిన నాటకాలూ, ఆయనుకున్న ఆసక్తి.

మళ్ళీ ఆయన చదువుకొనే రోజుల దగ్గరకు వద్దాం.

బందరులో చదువు అయిపోయాక, మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో F. A . లో జాయిన్ అయ్యారు. అక్కడ ఆయనకు సీనియర్ కొండా వెంకటప్పయ్య గారు. ఆయన ప్రముఖ రాజకీయ నాయకుడు. ఆ కాలేజీలో ఒకసారి ఓరల్ సైన్స్ అనే పిరియడ్ జరుగుతున్నది. అప్పుడు ప్రొఫెసర్ లాయిడ్ ఒక మాట అన్నారు. కాలు ఎత్తి తన బూటును చూపిస్తూ కుర్రవాళ్ళను ఉద్దేశించి

"మీరు విగ్రహారాధన చేస్తారు కదా!ఆ విగ్రహం బదులుగా నా బూటును పూజించండి"అన్నారు. సహజంగానే కుర్రవాళ్ళకు కోపం  వచ్చింది. అందరూ  బయటకు వచ్చి, సమ్మెకు పిలుపుని ఇచ్చారు. పదిరోజుల పాటు సమ్మె జరిగింది. ఆ సమ్మెకు నాయకత్వం వహించింది కొండా వెంకటప్పయ్య, హనుమంతరావు అనే మరొకాయన. పది రోజుల తర్వాత రాజీ కుదిరింది. అందరూ మళ్ళా క్లాసులకు వెళ్లారు. కాకపోతే, కాలేజీ యాజమాన్యం ఏం చేసిందంటే, ఈ సమ్మెకు నాయకత్వం వహించారు అనే కారణంతో కొండా వెంకటప్పయ్యనీ, హనుమంతరావు గారినీ హాస్టల్ నుండి బయటకు పంపించారు.

వాళ్ళు బయటకు వచ్చి, తంబు చెట్టి స్ట్రీట్ లో ఒక ఇంట్లో, ఒక హాలు అద్దెకు తీసుకున్నారు. ఆ హాలు, సోఫాలతో కూడా కలిపి అద్దె నెలకు రెండు రూపాయలు. తమ మిత్రులను బయటకు పంపించేశారు అనే కారణంతో నాగేశ్వరావుగారు కూడా ఆ హాస్టల్ నుండి బయటకు వచ్చేసి, ఆ హాలులోనే మిత్రులతో అద్దెకు ఉండేవారు. ఈ విషయాల్ని ఇంత వివరంగా ఎందుకు ప్రస్తావించానంటే, ఈ సంఘటన జరిగిన 25 సంవత్సరాల తర్వాత కాశీనాథుని నాగేశ్వరావుగారు కోటీశ్వరుడు అయిపోయి, బొంబాయి లో స్థిరపడిపోయి, అక్కడ నుండి మద్రాస్ వచ్చి, ఆ ఇంటిని కొని, ఆ ఇంట్లోనే ఒక దినపత్రిక పెడతాను అని అప్పటికి ఆయనకు ఏమాత్రం ఆలోచనలేదు. ఇది చాలా విచిత్రమైన వంటి సంఘటన.

ఆయన అక్కడ చదువుకుంటూండగానే ఓ సంఘటన జరిగింది. రెంటాల సుబ్బారావు గారనే పెద్దమనిషి వాళ్ళ మేనగోడలుకి సంబంధం చూస్తున్నారు. ఆ అమ్మాయి పేరు రామాయమ్మ. ఆయనకు నాగేశ్వరావు అనే కుర్రవాడు మంచివాడు అనే తెలిసింది. అతను నాగేశ్వరావుగారి దగ్గరకు వచ్చి"మా మేనకోడలు వివాహానికి వుంది. చేసుకుంటావా?"అని అడిగారు.

ఈ రెంటాల సుబ్బారావు గారి ప్రత్యేకత ఏమిటంటే, “సుబ్బారావు మేడీజీ”అని పిల్లలకు గైడ్లు రాసి, బాగా సంపాదించాడు. మందులు కూడా తయారుచేస్తుండేవాడు. నాగేశ్వరావుగారు ఆయనతో మాట్లాడిన పిమ్మట, వాళ్ళ మేనగోడల్ని పెళ్లి చేసుకుందామని అనుకున్నారు. అయితే, వాళ్లలో అది ‘శాఖాభేదం’ వాళ్ళ అమ్మ గారికి అది నచ్చలేదు. అందుకని “వివాహానికి రాను”అని అన్నారు. అలా వాళ్ళ అమ్మగారు లేకుండానే మిత్రుల సహాయంతో 1890 లో రామాయమ్మని వివాహం చేసుకున్నారు.

వివాహం అయ్యాక, రెంటాల సుబ్బారావుగారిని చూసి, ఏదైనా వ్యాపారం చెయ్యాలని అనిపించింది. వ్యాపార ప్రయత్నాలలో భాగంగా ముందు వుద్యోగం చేద్దాం అనుకున్నారు. అందుకని కలకత్తా వెళ్లి వుద్యోగం చేశారు. తరువాత బొంబాయి వెళ్లి అక్కడ కూడా వుద్యోగం చేశారు. ఈ మధ్యలో కుటుంబంలో ఏవో ఇబ్బందులు వచ్చాయి. అందుకని పల్లెటూరులో వ్యవసాయం చూసుకుందామని అనుకుని, వచ్చేసారు. కానీ, కొన్నాళ్లకే మళ్ళీ బొంబాయి వెళ్లారు. అలా 1895 లో రెండోసారి బొంబాయి వెళ్ళినపుడు "విలియం&కో " లో చేరారు. ఖాళీ సమయాల్లో ఏవో కొత్త మందులు తయారు చెయ్యాలని, ఇంట్లో ప్రయోగాలు కూడా చేస్తుండేవారు.

అలాంటి ప్రయత్నాల్లో ఉండగా, మద్రాస్ నుండి వాళ్ళ బావమరిది వుత్తరం రాశాడు. "బావగారూ! మీరు ఎంత కాలం వుద్యోగం చేస్తారు? మీకు యాభై, వందా వస్తున్నాయి. ఇక్కడ ఒక జమీందారు దగ్గర ట్యూటర్ వుద్యోగం చూసాను. వచ్చెయ్యండి"అని.. దానికి సమాధానంగా నాగేశ్వరరావుగారు "బావగారూ!నేను గత 9 సంవత్సరాలుగా ఒక ఆశయంతో కృషి చేస్తున్నాను. నేను ఇంకా అనుకున్న గమ్యం చేరలేదు. ఎన్ని కష్టాలైనా పడతాను. గెలిచానా అదృష్టవంతుడ్ని అవుతాను. ఓడిపోయానా? చావలేక, బ్రతకలేక, బ్రతుకుతున్న వేలాది మంది దురదృష్టవంతుల్లో ఒకడిని అవుతాను. ఇప్పుడు నాకు నెలకు 100 రూపాయలు వస్తున్నాయి. వచ్చే సంవత్సరం మరొక 50 రూపాయలు పెరుగుతాయి. నాకు ఈ మందుల ప్రయోగాలు ఫలితాన్ని ఇస్తాయనే నమ్మకం వుంది"అని వుత్తరం రాసి, మరి మద్రాస్ వెళ్ళలేదు.

ఆయన ఆ క్షణంలో 'తన వాళ్లందరికీ దగ్గరగా ఉండవచ్చు' అని మద్రాస్ వెళ్ళడానికి నిర్ణయించుకుంటే... బహుశా ఈ కథ ఉండేది కాదు. ఆయన ఎట్లాగయినా ఒక మందు కనిపెట్టాలి అనే దృఢ దీక్షతో ఉండిపోయి చేసిన ప్రయోగాలు 1899వ సంవత్సరంలో ఒక రూపానికి వచ్చాయి. అదే "అమృతాంజనం"అనే తలనొప్పి మందు. అది మార్కెట్ లోకి విడుదల చేసిన తర్వాత విపరీతమైన ప్రజాదరణ పొందింది. ముందుగా ఉత్తర భారతదేశం అంతా విస్తరించేసింది. తరవాత మరి కొన్ని దేశాలకు కూడా వెళ్ళింది.

అమృతాంజనం విడుదలయిన 1,2 సంవత్సరాల్లోనే లక్ష సీసాలూ, లక్షన్నర సీసాలూ మార్కెట్ చేశారు. మొట్ట మొదట్లో ఆయనా, ఆయన భార్యా అందరూ కలసి ఆ సీసాల మీద లేబుల్స్ అతికించేవారట. ఆయన అమృతాంజనం తయారు చేసేటప్పుడు ఏవేవో ద్రవాలు కలిపేవారు. అయితే, అందులో కలిపే ఒక ద్రవం మాత్రం ఆయనకు మాత్రమే తెలుసట. ఆ ద్రవం కలపడం వల్ల మాత్రమే అమృతాంజనంకి తలనొప్పి తగ్గించే శక్తి వస్తుందట. అది ఏమిటనేది రహస్యం. ఆయన చివరిరోజుల్లో ఆ రహస్యాన్ని వాళ్ళ అమ్మాయికి చెప్పారట. ఆమె కొన్నాళ్ళు ఆ మందుని తయారు చేశారు. ఆ తరువాత తరాలకు ఆ రహస్యం ఎలా వెళ్లిందో తెలియదు. మొట్ట


మొదట్లో మాత్రం నాగేశ్వరావు పంతులు గారే, చివర్లో ఆ మందుని కలిపి ఫైనల్ ప్రోడక్ట్ గా విడుదల చేస్తుండేవారు.

అమృతాంజనం ఇలా అందరిలోకి వెళ్ళడానికి మరొక ముఖ్య మైన కారణం, ఆయన అనుసరించిన వ్యాపార ప్రకటనలు. చాలా విభిన్నంగా వ్యాపార ప్రకటనలు అన్ని పత్రికల్లోనూ విడుదల చేస్తూ ఉండేవారు. అమృతాంజనం నొప్పుల నివారణే గానీ, దానికి ఆంధ్ర సాహిత్యంలో శాశ్వత స్థానం ఏర్పడింది. ఒక తలనొప్పి ముందుకి సాహిత్యంలో స్థానం ఏర్పడడం చాలా విచిత్రంగా ఉంటుంది కదా! “శ్రీకరి నారాయణాచార్యలు అనే ఆయన “అమృతాంజనం శతకం “ రాసి దాన్ని నాగేశ్వరావు పంతులు గారికి అంకితం ఇచ్చారు. అప్పట్లో ఈ అమృతాంజనం శతకం చాలా ప్రసిద్ధి పొందింది.

దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారు అమృతాంజనం మీదా, నాగేశ్వరావు పంతులుగారి మీదా ఒక చాటువు కూడా రాశారు. అది ఇలా ఉంటుంది. “ ఆంధ్ర పత్రిక తోడ అమృతాంజనంబిచ్చి, తలనొప్పి బాపెడు ధన్యునెవడు? లక్షలాదిగా డబ్బు, దీక్షతో.. బిక్ష కోటిని దాల్చు దక్షుడెవ్వడు?ప్రతి కాన్ఫరెన్సుకూ గతి నీవేయని వేడ, ప్రెసిడెంటు కానీ రసికుడెవడు?మితవాది హితుడౌచు,అతివాది గతుడవుచు,అందునిందును చేరువాడెవ్వడు? కాశీనాధుని ..... పొట్ట కుండిన రంధ్రంబున పుట్టి... నిండకుండనే నింట నీల్గి.. శ్రీరామ చంద్రా” కాశీనాథుని నాగేశ్వరావు గారు పుట్టకపోతే గనక ఆంధ్రు లందరూ పుట్టమునిగి గిట్టు చుండేవారు. అని చాటువు లాగ కొంత అతిశయోక్తి చెప్పారు.

ఇలా ఆయన చేసిన వైవిధ్య భరితమైన ప్రకటనల వల్ల ,అమృతాంజనం వ్యాపారం విపరీతంగా అభివృద్ధి చెందడమే కాకుండా, ఆయన్ని కొద్ది రోజుల్లోనే లక్షాధికారినీ, కోటీశ్వరుడిని కూడా చేసింది. ఆయన వ్యాపారాన్ని స్థిరం చేయడానికి రాత్రుళ్ళూ, పగళ్ళూ శ్రమిస్తూ ఉండేవారు. అయినా అప్పటి రాజకీయ పరిణామాల దృష్ట్యా, స్వాతంత్ర ఉద్యమ పోరాటాలనుండి దూరంగా ఉండలేకపోయారు.

1905, 06 ప్రాంతాల్లోనే బెంగాల్ విభజన, వందేమాతరం ఉద్యమం లాంటివి ప్రారంభం అయ్యాయి. 1907 లో అమృతాంజనం వ్యాపారం చాలా ఉచ్ఛస్థాయిలో జరుగుతున్న రోజుల్లో సూరత్ లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ కు హాజరయ్యారు. అక్కడ రాజకీయ నాయకులూ చెప్పిన ఉపన్యాసాలు అన్ని విన్నారు. కలకత్తా లోనూ, బొంబాయిలోనూ అటు బెంగాల్ వాళ్ళూ, ఇటు మహారాష్ట్రీయులు సాహితీ, సాంస్కృతికపరంగా ఎంత ముందు వున్నారో తెలుసుకున్నారు. “ఆంధ్రులందరూ కూడా వీటికి దూరంగా వున్నారు. వారిని ముందుకు తీసుకువస్తే బాగుంటుంది. దానికి సాధనం ఒక పత్రిక” అని ఆలోచించి, బొంబాయి నుండి పత్రిక నడుపుదాం అనుకున్నారు.




అసలు బొంబాయి నుండి పత్రిక నడపడం అనేది ఒక సాహసం. ఎందుకంటే, ముందుగా ఒక తెలుగు ప్రెస్ ఉండాలి. అందులో పని చేసేవాళ్ళు ఉండాలి. దానికి సంపాదకత్వమూ, ఉప సంపాదకత్వమూ.. ఇలాంటివన్ని కావాలి. అయినా కానీ, ఇలాంటి ఇబ్బందులు వుంటాయని ముందే ఊహించి, వాటన్నిటికీ సిద్ధపడి,వాటిని సాధించి, విజయవంతమైన పత్రికను బొంబాయి నుండే ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. మొట్టమొదటి సారిగా 1908 సెప్టెంబర్ 9 వ తేదీన బొంబాయిలో "ఆంధ్ర పత్రిక"వార పత్రిక ను విడుదల చేశారు. అదొక చారిత్రాత్మకమైన రోజు అని చెప్పుకోవచ్చు.

ఎక్కడో కృష్ణా జిల్లా పల్లెటూరులో పుట్టిన కుర్రవాడు, కలకత్తా వెళ్లి, మద్రాస్ వెళ్లి, మళ్ళీ బొంబాయి వెళ్లి, సొంతంగా ప్రయోగాలు చేసి, అమృతాంజనం కనిపెట్టి, లక్షాధికారి అయ్యి, ఒక పత్రికను స్థాపించుకున్న ఘనతను తెచ్చుకున్నారు కాశీనాథుని నాగేశ్వరావు పంతులు గారు. అయితే, "పత్రిక ప్రారంభం అయింది" అని చెప్పుకున్నంత తేలిక కాదు ప్రారంభం కావడం. అసలు ఆ పత్రిక ప్రారంభం కావడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అక్కడ నుండి ఆ తెలుగు పత్రికను ఆంధ్ర దేశానికి ఎలా పంపించేవారు? అప్పట్లో రోజూ పోస్ట్ ఉండేది కాదు. వారానికి రెండు రోజులే పోస్ట్ ఉండేది. ఆంధ్రులు ఆ పత్రికను ఎలా తమ హృదయాలకు హత్తుకున్నారు? 83 సంవత్సరాల పాటు నిరాఘాటంగా కొనసాగడానికి, దాని విజయానికి కారణాలు ఏమిటి? ఎవరెవరు భాగస్వాములుగా వున్నారు? ఇలాంటివన్నీ తరువాత భాగంలో తెలుసుకుందాం.

అక్షరీకరణ – వి. వెంకటరావు

2020 ఆగస్టు11 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS